పెద్దకొడుకు

ఉత్తరం చదువుకున్న వెంకట్రామయ్యగారు కొంతసేపు అలా వుండిపోయారు. కొంతసేపయాక తేరుకుని

'ఓయ్, అబ్బాయి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది' అంటూ భార్య గదిలోకి వచ్చారు. 'ఓ, నిద్రపోతున్నావా?' వెనక్కి వెళ్ళిపోబోయారు.

'లేదండీ, అలా మోగన్ను పడిపోయింది.'

'అబ్బాయి ఉత్తరం రాశాడు.'

'అంతా కులాసానా? వస్తున్నారా?' లేని బలం తెచ్చుకుని తలగడనిలబెట్టి నడుం దానికి జేరవెయ్యబోయింది పేరిందేవమ్మ.

"ఏదండీ ఉత్తరం?"

నీరసంతో వణకుతున్న చేతులతో ఉత్తరం అందుకుని కళ్లు చిట్లించి ఓ క్షణం చూసి ఉస్సురని నిట్టూర్చింది.

'నాకో కార్డుముక్క ఇవ్వండి. రెండు ముక్కలు రాసిపడేస్తాను.'

కార్డు తీసుకుని శ్రీకారం చుట్టబోయిన పేరిందేవమ్మకి కళ్లు మసక మసకగా అయి చీకట్లు కమ్ముకున్నాయి. ఒళ్లంతా చెమట పట్టేసింది.

'వాడిని రావద్దని రాయండి. నా కిప్పుడప్పుడే మీరే రాసి పోస్టులో పడెయ్యండి.'

భార్య మాటలు విని వెంకట్రామయ్య ఆశ్చర్యపోలేదు. ఆలోచనలో పడ్డాడు.

కడుపున పుట్టిన బిడ్డ వస్తానంటే ఎందుకు కాదంటోందో తనకు తెలియకపోలేదు. తల్లి ప్రాణం తల్లి ప్రాణమే. అందుకనే చూపించారు ఉత్తరం. రావద్దని రాయమంటోంది. తీరా ఏదైనా జరగరానిది జరిగితే....అభాండం మీద పడితే భరించడం కష్టం. కష్టాలన్నిటినీ భరించవచ్చు - మాటపడటం తనవల్లకాని పని. రమ్మని రాయడం భావ్యం. రావద్దని రాయడమెలా? వస్తున్నానని రాస్తున్న కొడుక్కి రావద్దంటున్న తల్లి మాట ఎలా రాయాలి?

'ఏమిటండీ ఆలోచన?'

మగతనుండి మేల్కొని అడిగింది పేరిందేవమ్మ. అయినా అది మాటవరస కడిగిన ప్రశ్నే. మనసులోని ఆలోచనల్ని ముఖంమీద చదవగలిగిన, ప్రజ్ఞ అన్యోన్య దాంపత్యం కొన్ని దశాబ్దాలు సాగించిన తరువాత భార్యాభర్త లిద్దరికీ కరతలామలకమే.

'ఏంలేదు - చిన్నాడు రాసిన ఉత్తరానికి జవాబు.....' వాక్యం ఎలా ముగించాలో తెలియక ఆపేశారు.

'నేనెలానూ బ్రతకను. దగ్గరా, దాపలా? అంత దూరం నుంచి రావడం మాటలా? వచ్చినప్పుడల్లా, శెలవూ, పిల్లల చదువులూ, బోల్డు డబ్బూ దండగ.'

ఆరముగ్గిన జీవితానుభవం - నాకంటె నీ తెలివితేటలే ఎప్పుడైనా ఎక్కువ - చాలా జటిలమైన సమస్య. దీని పరిష్కారం యెంత సులువుగా సూచించింది! రావద్దనే తాత్పర్యమైనా అందులో ఎంత నాజూకుదనం.

వెంకట్రామయ్యగారు తృప్తిగా చిరునవ్వు నవ్వారు.

'అయితే నేనే రాస్తా' రెండు వాక్యాలు రాసి ఆమెవంక చూసి పూర్తి చేసి చదువుతా అన్నారు.

"నువ్ రాసిన ఉత్తరం అందింది. అమ్మ కులాసా. మొన్ననే వచ్చివెళ్లావ్. నువ్ వచ్చినప్పటికంటె కొంచెం నయంగా వుంది పరిస్థితి. పిల్లలకు బడీ, నీకు శెలవూ పోతుంది. రావద్దని అమ్మ రాయమంది. డాక్టరు మందులు మార్చి రాశాడు. పెద్దాసుపత్రికి కూడా తీసుకెళ్లాను. అదే వైద్యం కొనసాగించమని చెప్పారు.

కోడలికీ, పిల్లలకీ ఆశీస్సులు."

రాసిన ఉత్తరం చదివి వినిపించారు వెంకట్రామయ్యగారు మొదటి వాక్యమైనా వినకుండా మగతనిద్రలోకి జారిపోయింది పేరిందేవమ్మగారు.

ఆమెవంక అలా తదేకంగా చూస్తున్నారాయన.

'సుగర్ ఎక్కువయితే ఈ నీరసంమీద కోమా వచ్చేస్తుంది. గుండెపోటు ఎక్కువయితే పక్షవాతం వచ్చేస్తుంది. మధుమేహం, గుండెజబ్బు, రెండూ జతకూడితే ప్రమాదమే. ఒకదానికి తిండి పనికిరాదు. రెండోదానికి తినక వీల్లేదు. మరేం చేస్తాం మాష్టారూ - జాగ్రత్తగా ఈ మందులు వాడండి, పథ్యంగా వుండాలి.'

డాక్టరు అయిదేళ్ల నుంచి చేస్తున్న వైద్యమే. నెల నెలకీ, ఈమధ్య పరిస్థితి మరీ అయోమయం అయిపోతూంది. డాక్టర్లు ఎంత మంచివాళ్లయినా, ఎంత చదువుకున్నవాళ్లయినా, వాళ్లు చెయ్యగలిగిన దానికీ మేరలేకపోలేదు. గట్టిగా ఆలోచిస్తే చివరకు జలుబుకే మందులేదు. కాలం చెయ్యవలసిన పనులు మనిషి కెలా సాధ్యం! వాళ్ల వృత్తి ధర్మం కాబట్టి, తమ కుటుంబంయెడల తనకున్న పేరుప్రతిష్టలయెడల ప్రత్యేకమైన అభిమానం వుండబట్టీ వివరంగా వున్న సంగతి చెప్పాడాయన.

కొన్నివారాల క్రిందట ఆయన సలహామీద పెద్దాసుపత్రికి వెళ్లారు. పరీక్షలన్నీ పేరుపేరునా చేశారు. వైద్యంలో విశేషమైన మార్పు లేకపోయినా, పరీక్షలన్నీ పకడ్బందీగా చేసి, జాగ్రత్తగా వుండాలన్నారు.

అయితే వాటివల్ల వెంకట్రామయ్యగారిలో ఓ రకమైన ఆశ కలగడం ప్రారంభించింది. పేరిందేవమ్మకి మాత్రం తను మళ్లీ ఇంత చేసుకు తినగలననే నమ్మకం పోయింది. అలా అలా మంచం ఎక్కినావిడ మూడు నెలల్లో రెండుసార్లు 'సరిసరి' అనిపించేసింది.

పెద్దబ్బాయీ, కోడలూ, పిల్లలూ రెండుసార్లు చూసివెళ్లారు. రెండో అబ్బాయీ వాళ్లూ వచ్చి ఓ నెలరోజులున్నారు. కొంచెం కులాసాగా వున్నాక తనే వెళ్లమని పంపించేసింది.

పెద్దబ్బాయి దగ్గర నుంచి ఉత్తరం వచ్చిందనుకుని లేని బలం తెచ్చుకుని కూచుంది. దస్తూరీ చూడగానే గుండెల్లో రాయి పడింది పేరిందేవమ్మకి.

ఆయన ముఖం చూస్తే జాలి కలుగుతోంది. ఇద్దరు పిల్లల్నీ ఎలా సాకిందీ తల్లిగా తనకు తెలుసు. ఇద్దరియెడలా ప్రేమ వున్నా పెద్దాడిమీద ఆయన ప్రత్యేకమైన ప్రేమ చూపిస్తే

తనేమనుకుంటుందోనని ఆయన మనసులో మెర చిన్నబ్బాయిమీద ఆయన ఆపేక్ష చూపించాలని ప్రయత్నం చేస్తున్నారని ఆవిడకీ తెలుసు.

'అబ్బాయి ఉత్తరం రాశాడు' అని చెప్పడంలో భావం 'నీ కొడుకు రాశాడోయ్' అని. తన కొడుకు దగ్గర నుంచి వచ్చిందని చెబితే, తన కన్నకొడుకు వస్తున్నాడని తను కొండెక్కినంత సంతోషం పొందుతుందని ఆయన ఉద్దేశ్యం.

'పాపం, ఈయన కష్టాల్లోంచి యెలా బైటపడతారో! నాకు వాడిమీదకంటే పెద్దాడి మీదే మమకారం ఎక్కువని ఈయన్ను నమ్మించటం యెలా? అబద్ధాలాడడానికి, కల్లబొల్లి కబుర్లు చెప్పడానికీ కళ కావాలి. వీటిని నమ్మినట్టు సూటిగా చెప్పిన నిజాన్ని యెవరూ సులువుగా నమ్మరు.' ఆలోచన అలసటతో నిద్ర ముంచుకొచ్చింది పేరిందేవమ్మకి.

'పెద్దాడిని పిల్చి ఓ రెణ్నెల్లుండమంటే బాగుణ్ను. ఆరోజు పదోసారి మనసులో అనుకున్నారు వెంకట్రామయ్యగారు. వాడొస్తే కొండంత బలం వచ్చినట్టుంటుంది. వాడే తన బాధ్యతని పంచుకోగల మనిషి. కష్టం తెలిసిన మనిషి. కాని, కాని అలా తొందరపడకూడదు - పాపం, నేడో, రేపో అని వున్న మనిషి, దానికి కష్టం కలిగించకూడదు. నా విధిని నేను నిర్వర్తించాలి. ఒక భార్యను చిన్నవయసులోనే సాగనంపినవాడిని. నేనెటూ రాటుదేరిపోయాను.'కంటిలోనికి రాని కన్నీళ్లు గుండెలోనే ఆవిరై ఉస్సురని నిట్టూర్చారాయన. 'కడుపుతీపి తనకు తెలియనిది కాదు. పెద్దాడు దాని కొడుకు కాదు - చిన్నాడు ఇద్దరికీ కొడుకు. చిన్నాడు వస్తాడంటే లేచి కూచుంటుందనుకున్నాడు - కాని వద్దని రాయమంది. వాడి మనసు నొప్పించకుండా ఎలా రాయాలో సూచన కూడా చేసింది.' ఆలోచిస్తున్న కొద్దీ పరిస్థితి వింతగా తోస్తోంది.

చిన్నబ్బాయికి రాసిన జవాబు పోస్టు చెయ్యడానికి బయలుదేరారు వెంకట్రామయ్యగారు 'జాగ్రత్తమ్మా, ఆవిడ నిద్రపోతోంది. తలుపు చేరవేసి వెళుతున్నా' అని వంటావిడకి చెప్పి.

మగతలోంచి మేలుకోగానే తలనిండా పేరిందేవమ్మకి ఆలోచనలు.

"వెయ్యిరూపాయలు రైలు ఖర్చులు పోసుకుని వచ్చాం. మాకేంవయినా విలువుందా? మా మాట ఎవరిక్కావాలి. ఏదో ఆయన వెర్రికాని. ఆయనకీ, ఆవిడకీ పెద్దకొడుకంటేనే ఇది. మనిషి విలువ తెలియని మనుషులు కొంతమందికి కడుపుతీపి కూడా తెలియదు."

చిన్నకోడలు పనిమనిషితో అంటున్న మాటలు వినగానే మనసు పిండినట్లయింది పేరిందేవమ్మకి. 'ఇంకా నయం, ఆయన చెవిన బడితే యెంత బాధపడతారో' అనుకుంది. 'అత్తయ్య' అని ఒక్కరోజు నోరారా ఆప్యాయంగా పిలుస్తుందేమోనని ఆశపడింది తను. తన వెర్రికాని మేడమీదనుంచి దిగి తన గదిలోకి రావడమే గగనం చిన్నకోడలికి.'జబ్బు మనిషి దగ్గర యెవరో ఒకరుండాలమ్మా, నే వంట చూసుకుంటా! మీరు అత్తయ్యాగారి దగ్గర కూచోండి.' వాళ్లు వచ్చిన రెండోరోజు అంది బ్రతిమాలుతూ వంటమనిషి.

'జబ్బు మనిషి దగ్గర కూచుంటే, ఆయన సంగతి, పిల్లల సంగతి ఎవరు చూసుకుంటారు. మందు కావలిస్తే పిలిచినప్పుడు వచ్చి ఇస్తాను' కసురుకుంది చిన్నకోడలు.

మేడ యెక్కడం మానేసి చాలారోజులయింది పేరిందేవమ్మ. రక్తపుపోటు యెక్కువగా వుందనీ

మధుమేహంవల్ల గుండె చెడిపోయిందనీ డాక్టరు చెప్పగానే తనకు చేతనయినంతవరకూ జాగ్రత్తగా వుంటోంది. 'ఇంటికి కాపలాగాఅయినా వుంటాను కింద గదిలో వుంటేనే నాకు బాగుంది' అంది భర్తతో.

చిన్నకోడలు వైశాలి మనసులో కలత రేపుతోంది. అయినా బయటకేమని ఏం లాభం? కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది.

'పిల్లలకీ ఆయనకీ కూడా ఇడ్లీ లేకపోతే వీల్లేదు. పొద్దున్న సాంబారూ ఇడ్లీ లేకపోతే ముఖాలు కడుక్కోరు తండ్రీ, పిల్లలూ. సాయంకాలం పూరీ కూడా తప్పదు మా ఇంట్లో.' వచ్చిన రెండవరోజు నుంచి ఊపిరాడని పని అప్పచెప్పేసింది వంటావిడకి.

నాలుగురోజులు చూసి భార్య ను వెంకట్రామయ్యగారు అడిగారు : అబ్బాయి అసలు కిందికి దిగడమేలేదు. ఒంట్లో బాగులేదా అని

'వెళ్లి చూడండి' అనాలన్నంత విసుగు వచ్చేసింది పేరిందేవమ్మకి. కాని కొడుకుమీద కోపం కోడలిమీద విసుర్లూ భర్తమీద చూపించడం అవివేకమనుకుంది. నేను కనుక్కుంటా కోడల్ని అనేసింది.

మేడ మెట్ల దగ్గరకొచ్చి కోడల్ని పిలిచింది. కోడలైతే పలికింది కాని కిందకొచ్చింది మనవరాలు.

'తల్లీ, దా, కూచో......'

ఎనిమిదేళ్ళ పిల్ల పంజాబీ డ్రెస్సు వంక చూసుకుంటూ గదిలో కొచ్చింది.

'మా వూరు బాగుందా. మీ వూరు బాగుందా?' పాప చెక్కిళ్లు గోముగా రాస్తూ అడిగింది పేరిందేవమ్మ.

'మా వూరే బావుంది. అక్కడయితే ఎంచక్కా టీ.వీ వుంది. ఛీ, ఇదేం వూరు, ఇక్కడ కరంటు వుండనే వుండదు - గడిగడికీ పోవడమే. మా ఇంటి పక్కన పిల్లలూ మేమూ యెంతో బాగా ఆడుకుంటాం. మజాగా వుంటుంది.'

'స్కూలు పోతోందని అమ్మ ఏమైనా అంటోందా?'

'రోజూ చదువుకోమంటుంది. ఏం చదవం? పుస్తకాలన్నీ అక్కడొదిలేసి వచ్చాం, రెండు రోజుల్లో తిరిగొచ్చేద్దాం అన్నారు నాన్నగారు.'

అడిగినదానికి సమాధానం అయితే చెబుతుంది కాని 'మామ్మా' అనైనా పిలవలేదు చిన్నది. మనస్సు కలుక్కుమంది పేరిందేవమ్మకి.

పెద్దకొడుకు పిల్లలయితే క్షణం వదలరు. ఇద్దరూ రామలక్ష్మణుల్లా తనదగ్గరే తిరుగులాడుతారు.' మేఁవిక్కడే చదువుకుంటాం మామ్మా' అని గదిలోనే తను పొమ్మనేవరకూ ఆడుకుంటారు. కావలసినప్పుడల్లా, మందులూ, మాత్రలూ, టానిక్కులూ, చెయ్యి కడుక్కోడానికి నీళ్ళూ ఇస్తూనే ఉంటారు.

వాళ్ళిద్దరూ వెళుతూ 'వస్తాం మామ్మా' అంటే తనకి కళ్లమ్మట నీళ్ళొచ్చాయి. 'బాగా చదువుకోండి బాబూ, ఇదిగో ఇద్దరూ మీక్కావలసినవి కొనుక్కోండి' చిన్న మనవడి చేతిలో నోటుంచింది తను.

'అదేఁవిటత్తయ్యగారూ, వాళ్లకి డబ్బులిస్తారెందుకూ?' వారించబోయింది కోడలు.

'పోన్లేవే, చిన్నవెధవయ్యలు. ఉండనీ, ఏ పుస్తకాలో కొనుక్కుంటారు.'

'వెళతాం, అత్తయ్యగారూ! అవసరమైతే కార్డురాసి పడెయ్యండి వెంటనే వస్తాం.' పెద్దకోడలు

కథా నిలయం
4737
శ్రీకాకుళం

ఆప్యాయంగా అంది. దానితో కొడుకూ అందుకున్నాడు.

'అవునమ్మా, దీన్ని తీసుకొచ్చి దిగబెడతా. అవసరమైతేనే తిరిగి వెళ్లిపోతా. నాకేం ఫరవాలేదు. నావంట నేను చేసుకోగలను. దేవుడి దయవల్ల నీ ఆరోగ్యం కుదుటపడితే అంతేచాలు - కాస్త సులువుగా ఉందని తిరిగెయ్యకు. వంట మనిషిని మరికొన్నాళ్లుండమను. ఇద్దరికయితే మాత్రం అన్ని పనులూ చేసుకోవాలిగా! మనిషి సాయం ఎలాగూ వస్తుంది?'

'నిజంవేన్రా, చిన్నాడూ రాస్తూనే ఉన్నాడు. మేడమీద అద్దెకిచ్చేస్తే ఓవందో నూటయాభయ్యో వస్తుందని. ఇద్దరే మనుషులు, ఇంత ఇల్లు ఏం చేసుకుంటారంటాడు, కాని నాన్నగారికి ఇల్లు అద్దెకియ్యడం ఎప్పుడూ ఇష్టం లేదు - నువ్వూ వాడూ వస్తే గదులెలాసరిపోతాయంటారు. ఎలాగైనా ఏనాడూ అద్దెకివ్వలేదు. ఏవో మా రోజులు ఇలా వెళ్లిపోతే చాలు. ఆ క్షణంకోసం కనిపెట్టుకుని వున్నాను నేను. ఆ తరవాతా, మీ యిష్టం.'

'అదేంటమ్మా అలా అంటావ్ ' చిన్నబోయాడు పెద్దబ్బాయి., అయినా ఆప్యాయంగా, 'నువ్వేమిటో నిరాశగా మాటాడుతున్నావ్! నీకిప్పుడేం ఎనభై వచ్చాయా, తొంభై వచ్చాయా. ఆ ఎదురింటావిడ చూడు, తొంభై ఏళ్ళుండి తన చేత్తో చేసుకున్న చక్కిలాలూ, చేగోడీలూ, కరకరా నమిలి తింటోంది, ఇకపోతే బ్లడ్‌ప్రెషర్లూ అవీ ఈ రోజుల్లో నూటికి అరవైమంది కుండేవే.'

'మరో కొన్నాళ్లుంటే బావుటుందేమోరా' అనాలని నాలిక చివరికొచ్చినా ఆ మాటలు ఆవిడంటే బావుంటదని భార్యవంక చూశారు వెంకట్రామయ్యగారు.

బాబూ, నువ్వొచ్చి నెలరోజులయింది. కోడలుచేత చేయించుకుంటూవుంటే యిలా ఎన్నాళ్లైనా చేయించుకోవాలనే వుంటుంది. అక్కడ పిల్లల చదువులు పోతున్నాయి - ఏదో ఈ మాత్రంగా లేస్తున్నానుకదా - ఇంకెన్నాళ్లుంటారు - వెళ్లండి - అవసరమైతే నాన్నగారు రాస్తారు.' పేరిందేవమ్మ ఉత్సాహంగా మాటాడింది.

'అవసరమంటే ఇదేకదమ్మా - మరి శెలవన్నది ఎందుకుంది? నీ ఆరోగ్యం బాగా మెరుగయ్యేవరకూ వుంటే మంచిదనే నా ఉద్దేశ్యం. పిల్లల చదువులకేం - పెద్దచదువులు కావుగా..... ఇంట్లో మాష్టారిని ఎలానూ పెట్టావ్, ఆయనే చూసుకుంటాడు.'

వెంకట్రామయ్యగారు కలుగచేసుకోవలసిన సమయం వచ్చిందని అన్నారు : "నిజంవేనే - మరో రెండువారాలుంటే మంచిది. ఏమంటావ్?"

'బావుందండీ, ఆడపిల్లలులేని నాకు కూతురిలా చేస్తోంది ఈ కోడలు. వాళ్లుండ గలిగితే అంతకంటే కావలసినదేంవుంది? అయినా మన స్వార్థం మనం చూసుకోడం అంత బావుండదు.'

'అమ్మా, నువ్ ఆమాటకు, నీచేత పుట్టిన దగ్గరనుంచీ చేయించుకున్నాం - ఓవారమో, నెలో ఇక్కడ నీకు చేస్తే మనుషులం అరిగి పోతామా.....పోనీ దీన్ని వదలి నేను వెళతాను.'

తనకిప్పుడు ఒంట్లో బాగా మెరుగ్గా ఉందనీ, వాళ్ల అవసరం అంతగా లేదనీ, పనిమనిషి, వంట మనుషుల సాయంలో కాలక్షేపం చెయ్యగలనని పెద్దకొడుకునూ, కోడలునూ నమ్మించేసరికి చాల శ్రమపడవలసివచ్చింది పేరిందేవమ్మకి.

'పెద్దాడు వెళుతూ ఐదొందలిచ్చాడే!' ఆనందంగా చెప్పారు భార్యతో.

4137

'ఇస్తాడని నాకు తెలుసు. వాడి మనసు అలాంటిది.' - కళ్ళు తుడుచుకుందావిడ.

'ఎందుకా కంటతడి?'

'ఏం లేదు.'

బయటకు కారణం చెప్పకపోయినా తనలో తనే చర్చించుకుంది పేరిందేవమ్మ కన్నీళ్లెందుకో-

'నా కొడుకూ ఉన్నాడు. రక్తం పంచుకుని కడుపు చీల్చుకుని పుట్టినవాడు. వాడు ప్రేమించి పెళ్లి చేసుకుని ఇంటికి తీసుకొచ్చిన కోడలూ ఉంది. ఒంట్లో బాగులేదని రాస్తే వచ్చి ఏదో హోటల్లో విహారానికి వచ్చినట్టు మేడ దిగకుండా - రెండు పూటలా టిఫిన్లూ, కాఫీలూ, పాలూ, బోర్నవిటాలూ అన్నీ మేడమీదకే సరఫరా చెయ్యాలి - ఆయనకొచ్చే పెన్షను చూస్తే ఐదొందలు - ఇన్ని కొంటున్నారు, ఎలా వస్తున్నాయని వాళ్లెవరైనా అడిగారా? కోడలైతే కొత్త పిల్ల - కొడుక్కు తెలియని నిక్షేపాలేం లేవుకదా - వాడైనా అడగొద్దూ? - పోనీ డబ్బు మాట దేవుడెరుగు. ఆప్యాయంగా ఎప్పుడైనా కోడలూ పలకరించదు - కొడుకు సరేసరి. వాడికి పదిహేనొందలు జీతం అని సంబరపడాల్సిందే -'ఇదిగో ఈ వంద'అని ఒక్కసారి ఇవ్వడు- పైగా కోడలి మెడలో తను చేయించి వేసిన గొలుసేమయిందంటే జవాబు చెప్పడు.

ఉసురుమంది మనస్సు..

చిన్నబ్బాయి వచ్చిన రెండు వారాల్లో మరో ఐదొందలు ఖర్చయింది. కొడుకుతో డబ్బు విషయం చెప్పడానికి వెంకట్రామయ్యగారికి చిన్నతనం. డాక్టర్లకీ, మందులకీ గత రెండు మూడు నెలల్లోనూ సుమారు రెండువేలయిపోయింది. చిన్నకొడుకు వ్యవహారం తనకి నచ్చకపోయినా భార్య బాధపడుతుందేమోనని మెదలకుండా వూరుకున్నారు. పోనీ జబ్బు మాటెలావున్నా, వచ్చినవాడు తనకి ఆసరాగా వుండడంలేదు. ఇంట్లో వున్నంతసేపూ మేడ - లేకపోతే బయట ఎక్కడెక్కడో తిరిగి ఏ రాత్రికో ఇల్లు చేరడం. బయటకేమనడానికీ మనస్కరించక లోపల బాధ దిగమింగుకోలేక విలవిల్లాడారు వెంకట్రామయ్యగారు.

ఓరోజు మెల్లగా భార్య దగ్గరకు వచ్చి యెలా మొదలెట్టాలో తెలియక కాలుకాలిన పిల్లిలా గదిలోంచి బయటికీ, బయటినుంచి గదిలోకి తిరుగుతుంటే ఆయన చెప్పనవసరంలేకుండానే పేరిందేవమ్మకి విషయం అర్థమైపోయింది.

'బ్యాంకులో ఆఖరి ఐదొందలూ అయిపోయినట్లున్నాయి!' ఆవిడే ప్రారంభించింది.

'పోన్లే, ఏం చేస్తాం. అవసరానికని వుంచుకున్నదేగా.'

'మనం ఇప్పుడనుకుని ఏం లాభం? చదువుకున్నా, వయసొచ్చినా చిన్నాడికి కష్టం తెలిసిరాలేదు. కారణం వాడికి మనం చేసిన ముద్దు. వాడు ఆడింది ఆట పాడింది పాట. నాపేర వేసిన వెయ్యీ తియ్యండి. తరవాత భగవంతుడిదే భారం.'

'అదికాదే, ఆ డబ్బు తియ్యడమెందుకు? ఈ ఉంగరం...ఎలానూ ఇరుకైపోయి చిరాకుగా వుంది.'

పేరిందేవమ్మకి కళ్లలో నీళ్లు తిరిగాయి. మొదటిజీతం అందుకుని బంగారం సులువుగావున్న ఆరోజుల్లో అరతులం ఉంగరం చేయించి తెచ్చాడు పెద్దాడు. అయితే తన వేలికి బాగా వదులై పోయింది. 'మీరు పెట్టుకోండి, మీచేతికి చాలా బాగుంది' తనే ఆయన వేలికి తొడిగింది.

'అమ్మా, నేను నీకని తెచ్చినది నాన్నగారి కిచ్చేశావ్, నీ ఆశీర్వచనం వుంటే నీకు గాజులే చేయించి తెస్తానమ్మా' అన్నాడు పెద్దకొడుకు.

'నాకు గాజులెందుకులేరా, కోడలి మెడలోకి ఓ రెండుతులాల గొలుసు చేయించు' అంది తను.

ఆ ఉంగరం అమ్మేస్తే మరో పదిహేను రోజులు గడుస్తాయి. కాని వాడొచ్చి ఆయన వేలు చూస్తే బాధపడతాడు - అలా జరగకూడదు. పేరిందేవి అనునయంగా చెప్పింది : "చూడండీ, వాడు ఎంతో ఆప్యాయతతో చేయించింది. అది అమ్మేస్తానంటే ఏం బావుంటుంది. వాడు బాధపడడూ? చూడండి చిన్నాడూ ఉన్నాడు. మేడదిగి అమ్మ ఎలా ఉందన్నమాటన్నా అడిగాడా? పైగా రాజాలా అన్నీ చేయించుకుంటున్నాడు. మొక్కయి వంగనిది మానయి వంగుతుందా, నేను ముద్దుచేశాను. నేనేమైనా అనుకుంటానని మీరూ ముద్దుచేశారు. చివరకి వాడలా తయారయ్యాడు."

'చిన్నవాళ్లు, మనం సర్దుకుపోతుండాలి.'

మూడు వారాలయ్యాక మరి ఉండబట్టలేదు పేరిందేవమ్మకి. మెల్లగా మేడమీదకెళ్ళింది ఓ రాత్రి. తన ముద్దులకొడుకు మంచంమీద పడుకొని ఓ చేత్తో పుస్తకం పట్టుకుని చదువుతున్నాడు. రెండో చేతిలో రెండున్నాయి. ఓగ్లాసూ, ఓ సిగరెట్టూ పక్క బల్లమీద ఓ బుడ్డీ, మరచెంబుతో నీళ్ళూ, కోడలూ కుర్చీలో కూచుని చదువుకుంటోంది.

'ఏమ్మా, ఇంకా పడుకోలేదూ?' తనని చూసి పుస్తకంలో ముఖం చాటుచేసుకుంది.

'ఏరా, నిన్నే?'

'నిద్దర రావడంలేకపోతే.'

'బావుంది, ఇదా నువ్‌చేసే నిర్వాకం - ఇల్లెలా గడుస్తుందని అడగవ్ - చచ్చావా, బ్రతికావా అని అడగవ్ - ఒకటీ ఒకటీ కరిగించి నెట్టుకొస్తున్నాం - నీ సరదాలేకాని కొడుకుగా నీ బాధ్యత నువ్ బోధ పర్చుకోకపోతే ఎలా? పైగా ఈ పాడు అలవాట్లు, ఇంట్లో, ఎంత బరితెగించేశావ్, ఛీ, నీకు సిగ్గులేదూ?' - ఆవేశం వచ్చింది పేరిందేవమ్మకి. ఉండబట్టలేక నాలుగూ అనేసింది.

'ఎందుకత్తయ్యగారూ, అలా ఆడిపోసుకుంటారు - మేం ఉండడం ఇష్టంలేకపోతే రేపే వెళ్లిపోతాం. తిండికోసం రాలేదిక్కడికి. తిండి లేకా రాలేదు. టెలిగ్రాంగా భావించి రమ్మని రాస్తే ఎక్కడివక్కడ ఇదిలేసివచ్చాం. మేం తిన్నదే మీకు ఎక్కువగా కనపడుతోంది' కోడలు కసిరేసింది.

ఎలవిల్లాడిపోయింది పేరిందేవమ్మ. కొడుకు ప్రేమించి , ఇంట్లో చెప్పకుండా చేసుకుని తీసుకొచ్చినపిల్ల - అత్తయ్యా అని పిలవడానికి నోరురానిపిల్ల - ఉద్యోగం చేసి నెలకు ఆరొందలు సంపాయిస్తున్న పిల్ల.

'హు! ఎవరి ఖర్మ వాళ్లది.'

కిందకొచ్చేసిన పేరిందేవమ్మ మరి మేడెక్క లేదు.

తెల్లవారగానే భర్తకు చెప్పింది - 'అబ్బాయికీ వాళ్లకీ టికెట్లు రిజర్వు చేయించేయండి - వాళ్లు వెళితేనే నాకు కొంచెం మనశ్శాంతి వుంటుంది.'

వెంకట్రామయ్యగారికి ఇంటి సంగతి తెలియక కాదు. భార్య ఏం బాధపడుతుందోనని

తెలిసినా కిమ్మనకుండా వూరుకున్నారు.

- మళ్లీ వస్తామని ఉత్తరం , చిన్నాడు.

'చిన్నాడికి ఉత్తరం పోస్టుచేసి రాగానే పెద్దాడ్ని రమ్మని టెలిగ్రాం ఇవ్వండీ!' అంది కళ్లు తుడుచుకుంటూ.

రెండోరోజు సాయంకాలానికి పెద్దాడూ, కోడలూ, పిల్లలూ వచ్చేశారు. పేరిందేవమ్మని చూసి అన్నాడు అబ్బాయి : 'దేవుడి దయవల్ల నువ్ కులాసాగా వున్నావమ్మా - టెలిగ్రాం చూసి హడిలిపోయాం.'

''ఏం కులాసా నాయనా.....' అన్నా, పేరిందేవమ్మ చుట్టూ కొడుకూ, కోడలూ, పిల్లలూ, భర్తా వుండడం చూసి మహారాజుని, నాకేం అనుకుని తృప్తిగా వూపిరి పీల్చుకుంది.

ఆ మరుసటిరోజు చిన్నవాడూ పిల్లలూ వచ్చారు. వెంకట్రామయ్యగారూ, పేరిందేవమ్మ మొహామొహాలు చూసుకున్నారు. అప్పుడు పెద్దాడు చెప్పాడు : 'నేను బయలుదేరుతూ ఎందుకయినా మంచిదని తమ్ముడికో టెలిగ్రాం ఇచ్చాను. వాడూ వచ్చాడు.'

పేరిందేవమ్మ ఏం మాటాడలేదు.

రాత్రి భోజనాలవుతుండగా పేరిందేవమ్మకి ఆయాసం వచ్చింది.

'డాక్టరునుపిలుస్తా' అంటూ వెంకట్రామయ్యగారు బయలుదేరారు. అంతా చుట్టూ వచ్చి నుంచున్నారు. 'అమ్మా, మీ చెల్లెల్ని పిలువ్!' అంది పేరిందేవమ్మ. వెళ్లి పిలిస్తే చిన్నకోడలు వచ్చింది.

'నేను మీకు ఇవ్వగలిగిందేం లేదమ్మా, ఈ గొలుసు పెద్దాడు చేయించాడు. ఆ రోజుల్లో ఐదుతులాలు. అమ్మాయ్ నీకు ఎలానూ ఆడపిల్లల్లేరు, ఇది చిన్నదాని కిచ్చేయ్ - గాజులు నువ్ తీసుకో - వాడిది మిగిలిస్తే కూతురు పెళ్లికి బాలతొడుగ్గా ఇవ్వచ్చు...'.పెద్దకోడలితోనే మాటాడుతోంది పేరిందేవమ్మ.

'అదేవిటత్తయ్యగారూ, అలా మాటాడుతున్నారు..... మీకేం ఆరోగ్యంగా వున్నారు. మీ ఆరోగ్యం ఇంకా బాగవుతుంది, నాది పూచీ.....''

'ఆ బావుంటుంది. వచ్చినప్పుడల్లా వెయ్యి రూపాయిలు పోసుకుని వస్తున్నాం. మరి మావల్ల కాదు.' చిన్నకోడలు మూతిముడిచింది.

'పోన్లెండమ్మా, మరిరాకండి...ఒరేయ్ నాయనా, నీకు అన్నీ తెలుసు-అయినా నేను చెబుతున్నాను. మీ అమ్మ పోలిక నీకు -జాలి గుండె - నాదో కోరిక నేను నిన్ను కనకపోయినా, నీకు నామీద ఎంత అభిమానమో నాకు తెలుసు. నే నిన్ను అడిగేది ఒక్కటే, నా తలకి కొరివి...'

'ఏవిటమ్మా, నిండు ఇంట్లో వాగాయిత్యం మాటలు...నువ్ పదికాలాలపాటు మాకు పెద్దదిక్కుగా వుండాలి.'

'వాగాయిత్యం కాదు. నిజం నీలాంటి కొడుకుంటే ఎన్నాళ్లు బ్రతికినా ఆనందమే కాని చావుబతుకులు మన చేతుల్లో లేవు...నాన్నగారిని జాగ్రత్తగా చూసుకో. నేనేమైనా అనుకుంటానని మనసులోమాట బయటికి చెప్పరు. ఆయన మనసు మరీ సున్నితం.'

ఆవిడ గొంతు పూడుకుపోయింది.

'పెద్దకొడుకును. నువ్ నాకు చెప్పాలా! నువ్వూ నేనూ వుండగా నాన్నగారికేవమ్మా, రాజాలా

వుంటారు. తమ్ముడు మాత్రం ఏం చదువులేనివాడా, తెలియనివాడా, ఏదో చిన్నతనం...' కళ్ళు తుడుచుకున్నాడు పెద్దబ్బాయి.

'తమ్ముడు, తమ్ముడు హుఁ! - అబ్బ!' గుండె చేత్తో పట్టుకుని వెనక్కి వాలిపోయింది పేరిందేవమ్మ.

'తమ్ముడేడి?' మరదలనడిగాడు.

'సినిమా కెళ్లారు. మరో కొడుకున్నాడన్న తలపైనా వుందీ ఈవిడకి. మనసులేని మనుషులు. చిన్నకోడలు వ్యాఖ్యానించింది కసిగా.

"ఓయ్, అయిపోయింది అలా పట్టుకో...తొందరగా, మంచంమీద ప్రాణం పోకూడదు..."

పెద్దకొడుకూ, కోడలూ దింపుతుంటే తనకు తెలియకుండానే ఘొల్లుమంది చిన్నకోడలు కూడా.

(దీపావళి కథల పోటీలో పాఠకులచే ప్రథమ బహుమతికి ఎంపికయి
రెండు బహుమతులు గెల్చుకున్నది)

ఆంధ్ర సచిత్ర వారపత్రిక,
2.11.1979